# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 30 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 4

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు

శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా ఆదివారం పత్రికకు సెలవు.

సోమవారం సంచిక వెలువడదు. పున:దర్శనం మంగళవారం

- బలగం టీవీ సీఈఓ బాలు కాయితీ


## హిమాచల్ ప్రదేశ్‌తో
# విద్యుత్ ఒప్పందం

- పెరిగిన డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ కోసం ఒప్పందాలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సిమ్లాలో హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుక్కు, ఆ రాష్ట్ర అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ ఒప్పందం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో వేగంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని, విద్యుత్ వనరుల విస్తరణకు, తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 ప్రకారం పర్యావరణ పరిరక్షణకు హిమాచల్ ప్రదేశ్‌తో 520 మెగావాట్ల హైడల్ విద్యుత్ ఒప్పందం చేసుకోవడం గొప్ప ముందడుగని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు భద్రతను పెంచుకునే అంశానికి కట్టుబడి ఉందన్నారు. శనివారం హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుక్కు, ఆ రాష్ట్ర అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర భాగస్వామ్యంతో ప్రతిపాదిత ప్రాజెక్టులు సెలి (400 మెగావాట్లు), మేయర్ (120 మెగావాట్లు)స్వచ్ఛమైన, ఆర్థికంగా మేలైన, విశ్వసనీయమైన విద్యుత్తు ను పొందడంలో ఉపకరిస్తాయని తెలిపారు. జల విద్యుత్తు అత్యంత విశ్వసనీయమైన గ్రీన్ పవర్. థర్మల్ పవర్‌తో పోల్చినప్పుడు హైడల్ పవర్ ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటుంది, అంతేకాకుండా థర్మల్ పవర్ ఉత్పత్తి ఖర్చు ప్రతి సంవత్సరం పెరుగుతూ ఉండగా హైడల్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు క్రమంగా తగ్గుతూ వస్తుందని వివరించారు. హిమాచల్ ప్రదేశ్ హిమాలయ పరివాహక నదులతో నిండి ఉన్న రాష్ట్రం కావడంతో సంవత్సరంలో 9నుంచి 10 నెలల పాటు నిరంతరం హైడల్ పవర్ ఉత్పత్తికి అనువుగా ఉంటుందని అన్నారు. హిమాచల్ తో పోలిస్తే దక్షిణ భారతదేశ నదులపై హై డల్ విద్యుత్ ఉత్పత్తి కాలం పరిమితంగా ఉంటుందన్నారు. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ ప్రభుత్వం హిమాచల్ ప్రదేశ్ సహజ వనరులను వినియోగించుకుని తెలంగాణ ప్రజలకు తక్కువ ధరకు, నమ్మకమైన, పర్యావరణ హిత విద్యుత్ అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని ఈ ఒప్పందం ముందుకు తీసుకెళుతుందన్నారు. ఈ ప్రాజెక్టులను తెలంగాణ జెన్కో నామినేషన్ విధానంలో చేపడుతుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ పవర్ వాటాను పెంచేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. భారతదేశ విద్యుత్ రంగంలో, అంతర్రాష్ట్ర సహకారానికి హిమాచల్ ఒప్పందం గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో తోడ్పాటును అందించడమే కాకుండా హిమాచల్ ప్రదేశ్ హైడ్రో ఎలక్ట్రిక్ వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు సహాయపడుతుందన్నారు. ఒప్పంద కార్యక్రమంలో రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకి, జెన్కో హైడల్ డైరెక్టర్ సచ్చిదానంద, హిమాచల్ ప్రదేశ్ ఎనర్జీ డైరెక్టర్ రాకేష్ ప్రజాపతి, హిమాచల్ ప్రదేశ్ స్పెషల్ సెక్రటరీ ఎనర్జీ అరిందం చౌదరి పాల్గొన్నారు.

# మండుతున్న ఎండలు...

- పగటిపూట వేగంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఎండ వేడితోపాటు తొడవుతున్న వడగాల్పులు
- మధ్యాహ్నం వేళ బయటకు రావాలంటేనే జంకుతున్న ప్రజలు
- 15 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో ఒక్కసారిగా ఎండల తీవ్రత పెరుగుతుంది. దీని ప్రభావంతో వడ గాలుల వీస్తున్నాయి. ఇక, శనివారం తెలంగాణలోని 15 జిల్లాలకు హైదరాబాద్ లోని వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. ఆదిలాబాద్, కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల్, ఖమ్మం, కొమరంభీం, మంచిర్యాల, ములుగు, నాగర్ కర్నూల్, నారాయణపేట్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, వనపర్తి జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో గరిష్టంగా 41 డిగ్రీలు ఉష్ణోగ్రతలు దాటి పోతున్నాయి. నేటి నుంచి మరింతగా ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని చెప్పుకొచ్చారు. అలాగే, ఉత్తర తెలంగాణలోని పలు జిలాల్లో 45 డిగ్రీల వరకు టెంపరేచర్స్ నమోదయ్యే అవకాశం ఉంది. ప్రజలు మధ్యా హ్నం సమయంలో బయటికి రావొద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. అవసరం అయితేనే తప్పా ఇంటి నుంచి బయటకు రావొద్దన్నారు. బయటకు వెళ్ళిన ప్పుడు టోపీ, గొడుగులు లాంటివి ఉపయోగించాలని హెచ్చరించారు. కాగా, ఈ రోజు నుంచి మరో మూడు రోజుల పాటు మరింత ఎండ వేడిమి పెరిగే ఛాన్స్ ఉంది. మరో ఐదు రోజుల పాటు రాష్ట్రం లో పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం తెలిపింది.

## లింక్ రోడ్ల నిర్మాణం చేపట్టండి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రాజధాని నగరంతో పాటు హెచ్ఎండీఏ పరిధిలో చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై సమీక్ష

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ నగరంలో ప్రజావసరాలకు అనుగుణంగా అనుసంధాన (లింక్) రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. రాజధాని నగరంతో పాటు హెచ్ఎండీఏ పరిధిలో హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ధ్వర్యంలో చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత పెంచడం, ప్రజలు ఎటువంటి అవాంతరాలు లేకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణం ఉండాలని ఆదేశించారు. హెచ్ఎండీఏ పరిధిలో 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. అనుసంధాన రహదారుల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న రహదారుల విస్తరణ విషయంలో భవిష్యత్ అవసరాలు, విశాల ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలని అధికారులకు సూచించారు. ఆయా రహదారుల నిర్మాణంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు వారికి సమయం కలిసి వచ్చేలా ఉండాలని, ఈ క్రమంలో అదనపు భూసేకరణకు కొంత అధిక వ్యయమైనా వెనుకాడవద్దని చెప్పారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైల్వే ప్రయాణికులకు శుభవార్త

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రైల్వే ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై ప్రయాణికులు టికెట్లను రైల్వే కౌంటర్‌లో కొనుగోలు చేసినా ఆన్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 'కౌంటర్ ద్వారా వెయిటింగ్ లిస్ట్ టికెట్లు కొన్న ప్రయాణికులు టికెట్ క్యాన్సిల్ చేయించుకోవడానికి రైలు బయలు దేరక ముందే స్టేషన్‌ను సందర్శించాల్సి ఉంటుందా?'అని బీజేపీ ఎంపీ మేధా విశ్రం కుల్‌కర్ణి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు. ప్రయాణికులు ఇకపై తమ టికెట్లను రద్దు చేసుకోవడానికి స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ప్రయాణికులు రైలు టికెట్లను కౌంటర్‌లో కొన్నా దానిని ఆన్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకోవచ్చని తెలిపారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో లేదా 139కి ఫోన్ చేసి టికెట్ రద్దు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. అయితే క్యాన్సిల్ డబ్బులు వసూలు చేసుకోడానికి రిజర్వేషన్ సెంటర్‌ను సందర్శించాల్సి ఉంటుందని తెలిపారు.

## మెట్రో సమయం పొడిగింపు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మెట్రో రైలు ప్రయాణికులకు మెట్రో ఎండీ ఎన్‌విఎస్ రెడ్డి శుభవార్త అందించారు. ఇప్పటివరకూ మెట్రో నడిచే సమయాన్ని పొడిగిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం ఆఖరి రైలు రాత్రి 11 గంటల వరకే అందుబాటులో ఉంటున్నది. ఇప్పుడు ఈ సమయాన్ని రాత్రి 11.45 గంటల వరకూ పొడిగిస్తున్నట్టు ఎన్‌విఎస్ రెడ్డి ప్రకటించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ సేవలు అందుబాటులో ఉండనున్నట్లు వెల్లడించారు. అయితే ప్రతి సోమవారం నుంచి శుక్రవారం వరకే ఈ సమయ వేళలు అమలులో ఉండనున్నాయి. అంతేకాక ప్రస్తుతం విద్యార్థులకు ఇస్తున్న సూపర్ సేవర్ హాలిడే ఆఫర్ మార్చి 31తో ముగియనుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు 20 ట్రిప్పుల డబ్బులతో 30 ట్రిప్పులు వెళ్లే ఆఫర్‌ను మరో ఏడాది పొడిగించారు.

## 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందే

- అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తానని ముఖ్యమంత్రి ప్రకటించారు
- కానీ ఇప్పటివరకు ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు
- బీజేపీ ఎంపీలు పార్లమెంటులో గళమెత్తాలి
- ఎమ్మెల్సీ కవిత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కామారెడ్డిలో శుక్రవారం నిర్వహించిన బీసీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. బీసీ డిక్లరేషన్ చేసిన నిజామాబాద్ జిల్లాలోనే ఒక్క బీసీ బిడ్డకు కూడా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ వంచించిందని అన్నారు. అలవిగాని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. చరిత్రలో నిలిచిపోయే పనులు చేయాలి కానీ చరిత్ర హీనులుగా మిగలవద్దని సూచించారు. ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే కాంగ్రెస్ పార్టీ చరిత్రహీనులుగా మిగిలిపోతుందని అన్నారు. బీసీ బిల్లులు అసెంబ్లీ ఆమోదించిన తర్వాత చోటే భాయ్ బడే భాయ్‌కి అప్పగించారని తెలిపారు. కోర్టులకు వెళ్తారా లేదా ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీ కాళ్ల మీద పడతారా అనేది తమకు సంబంధం లేదని.. 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు కానీ ఇప్పటివరకు ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. తెలంగాణలో కంటే ఎక్కువగా ఢిల్లీలోనే ఉండే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ ఎందుకు దొరకడం లేదని ప్రశ్నించారు. బీసీల విషయం వచ్చేసరికి ప్రధాని అపాయింట్‌మెంట్ ఎందుకు దొరకడం లేదని నిలదీశారు.

తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్ల తరహాలో తెలంగాణలో కూడా అమలు చేయడానికి ప్రధాని మోదీ చొరవ తీసుకోవాలని కోరారు. రూ. 4,500 కోట్లు ఖర్చు చేసి 2011లో నిర్వహించిన కులగణన నివేదికను ఎందుకు బయట పెట్టడం లేదంటే కాంగ్రెస్ వద్ద సమాధానం లేదని అన్నారు. 4,500 కోట్లు గంగలో పోశారు కానీ లెక్కలు అయితే బయటకు ఇవ్వలేదని అన్నారు. కులగణన చెయ్యబోమని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి బీసీలను వంచించిందని చెప్పారు. తెలంగాణ చట్టసభలు ఆమోదించిన బీసీ బిల్లులను తక్షణమే పార్లమెంటు పాస్ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లులను ఆమోదించడానికి తెలంగాణ బీజేపీ ఎంపీలు పార్లమెంటులో గళమెత్తాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయకపోతే కాంగ్రెస్, బీజేపీ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. అవసరమైతే మేం కూడా ఢిల్లీకి వచ్చి, బీజేపీపై పోరాటం చేస్తాం కానీ, కాంగ్రెస్ పార్టీని మాత్రం తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- 16 మంది నక్సల్స్ హతం

వివరాలు 2వ పేజీలో

## నేటి నుంచి సన్న బియ్యం సరఫరా

- ప్రజలకు ఉపయోగపడే కార్యాలయాల నిర్మాణ పనులను ప్రజా ప్రభుత్వం చేపడుతుంది
- మంత్రి శ్రీధర్‌బాబు
- పెద్దపల్లి జిల్లాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఉగాది నుండి రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరా చేయనున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి కమాన్ పూర్ మండలంలో రూ. 50 లక్షల డీఎంఎఫ్టిటీ నిధుల వ్యయంతో చేపట్టిన తహసిల్దార్ భవన నిర్మాణం, రామగిరి మండలంలో నూతనంగా తహసిల్దార్ కార్యాలయం నిర్మించడానికి రూ. 65 లక్షలు, రామగిరి కేజీబీవీ పాఠశాల అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ. 67 లక్షలు, నియోజకవర్గ కేంద్రమైన మంథని ఆర్డీవో కార్యాలయం వద్ద రూ.4.5 కోట్ల డిఎంఎఫ్టి నిధులతో సమీకృత ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్స్ నిర్మాణం, బాలికల ఉన్నత పాఠశాల రేనోవేషన్ కోసం రూ. 30 లక్షలు, ముత్తారం కస్తూర్బా కేజీబీవీ పాఠశాల కోసం 35 లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు అయన శనివారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు ఉపయోగపడే కార్యాలయాల నిర్మాణ పనులను ప్రజా ప్రభుత్వం చేపడుతుందని మంత్రి తెలిపారు. మంథని డివిజన్ కేంద్రంలో సమీకృత అధికారుల సముదాయం, నూతన ఆర్డీఓ కార్యాలయ నిర్మాణం చేపట్టామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో మాత్రమే ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు ఉన్న సమస్యలను చట్ట ప్రకారం పరిష్కారానికి కృషి చేయాలని, అధికారులలో జవాబు దారీతనం తీసుకుని రావడానికి చర్యలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి వ్యవస్థ వల్ల జరిగిన నష్టాలను భూ భారతి చట్టంతో పూడ్చెందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామన్నారు. చట్టానికి లోబడే మాత్రమే అధికారులంతా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు.

మండల కేంద్రాల్లో కూడా కార్యాలయాలు అంతా ఒకే ప్రాంగణంలో ఉండే విధంగా అనువైన స్థలాలను ఎంపిక చేయాలని మంత్రి కలెక్టర్ కు సూచించారు. ప్రభుత్వం కల్పించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం ప్రతిరోజూ వేలాది మంది మహిళలు వినియోగించు కుంటున్నారన్నారు. మహిళలకు రూ.500లకు గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రూ.500ల బోనస్ అందించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ బాగు చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఉగాది నుండి రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరా చేయనున్నామన్నారు. రైతులకు ఒక గింజ కూడా తాళ్ళు కట్ చేయకుండా మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు చేశామన్నారు.

## వెయ్యి దాటిన భూకంప మృతుల సంఖ్య

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మయన్మార్, థాయ్‌లాండ్‌లో సంభవించిన భూకంపం ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య వెయ్యికి పెరిగింది. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. భూకంపం కారణంగా కూలిన 30 అంతస్థుల భవంతి కింద మరో 43 మంది చిక్కుకుపోయారు. వీరిని వెలికి తీసేందుకు సహాయకచర్యలు జరుగుతున్నాయి. మయన్మార్‌లో భూకంపం సంభవించిన వెంటనే ప్రధాన నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ దేశాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే భారత్ నుంచి ఆ దేశానికి సహాయపు సామాగ్రిని విమానంలో పంపించారు.

## ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్న దంపతులు అరెస్టు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట్‌లో భారీ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టును మియాపూర్ ఎస్ వో టి పోలీసులు బట్టబయలు చేశారు. హఫీజ్ పేట లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో దాడులు నిర్వహించిన ఎస్ ఓటీ పోలీసులు దంపతులను అరెస్ట్ చేశారు. ఫేక్ కంపెనీల పేరిట బ్యాంక్ ఖాతాలను ఓపెన్ చేసి, ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న భార్యభర్తలను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న మాడిశెట్టి అజయ్, అతని భార్య సంధ్య కలిసి మూడు క్రికెట్ బెట్టింగ్ యాప్స్ ద్వారా భారీ స్థాయిలో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పోలీసులు వీరి అకౌంట్లను పరిశీలించగా, ఏకంగా 40 లక్షల రూపాయల విలువైన బెట్టింగ్ లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. పోలీసులు బెట్టింగ్ ముఠాను పట్టుకునే క్రమంలో నిందితుల నుంచి రూ. 55,000 నగదు, బ్యాంక్ ఖాతాల్లో రూ.22 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.. అంతేకాకుండా.. మొత్తం 7 అకౌంట్లను గుర్తించారు. అజయ్ గతంలోనే నాలుగు సార్లు క్రికెట్ బెట్టింగ్ కేసుల్లో పట్టుబడ్డాడు. గతంలోనూ బెట్టింగ్ లు నిర్వహిస్తూ పట్టుబడి నాలుగు సార్లు అరెస్ట్ అయి జైలుకు వెళ్లినట్లు తెలుస్తుంది. అయినప్పటికీ, మరోసారి బెట్టింగ్ నిర్వహిస్తూ పోలీసులకు దొరికిపోయాడు. పోలీసులు ఈ బెట్టింగ్ ముఠాతో సంబంధమున్న ముగ్గురు ఫంటర్లను అదుపులోకి తీసుకుని, వారిని మియాపూర్ పోలీసులకు అప్పగించారు.

## ఎవరిపైనా హిందీని రుద్దలేదు

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దక్షిణ భారతదేశంలో ఎవరిపైనా హిందీని రుద్దలేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. టీవీ9 నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వాట్ ఇండియా థింక్స్ టుడే' సమ్మిట్ రెండవ రోజు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఎవరిపైనా హిందీని రుద్దలేదని అన్నారు. నేను దక్షిణ భారతదేశానికి చెందినవాడిని కానీ హిందీ మాట్లాడటానికి ప్రయత్నిస్తాను. తాను హిందీ చదవలేదని, కానీ హిందీ నేర్చుకున్నానని చెప్పారు. గత 10 సంవత్సరాల మోడీ ప్రభుత్వంలో, ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవాలని ఎప్పుడూ తప్పనిసరి చేయలేదనే విషయాన్ని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి నేటి వరకు హిందీని వ్యతిరేకిస్తున్న వారు అర్థం చేసుకోవాల్సిందిగా సూచించారు.

ఇక కొన్ని రాష్ట్రాల్లో ఇతర పార్టీ ప్రభుత్వాలు గ్యారంటీలు ఇచ్చి, నిధులు కేంద్రం ఇవ్వాలంటే ఎలా అని ప్రశ్నించారు. తాము ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత తమదే అని అన్నారు. కాగా, ఇతర పార్టీల్లో తదుపరి అధ్యక్షుడు ఎవరో చెప్పొచ్చని, కానీ బీజేపీలో అలా కాదు.. జేపీ నడ్డా తర్వాత.. అధ్యక్షుడు ఎవరో దేవుడు కూడా చెప్పలేడంటూ కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# బ్రహ్మోత్సవాలు, ఇఫ్తార్ విందులో పాల్గొన్న సీఎం

**బలగం టీవి, హైదరాబాద్**

కొడంగల్‌లోని శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి (కొడంగల్ బాలాజీ) వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శనివారం స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ముఖ్యమంత్రి గారికి ఆశీర్వచనం అందించారు.

**ఇఫ్తార్ విందులో**

రంజాన్ పండుగను పురస్కరించుకుని కొడంగల్ పట్టణంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక మతపెద్దలు, ముస్లిం సోదరులతో కలిసి ముఖ్యమంత్రి గారు ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్యమంత్రి ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కొడంగల్ అభివృద్ధి కోసం ఎవరూ హైదరాబాద్ రావాల్సిన అవసరం లేదని, ఒక లేఖ రాసిస్తే తానే స్వయంగా కొడంగల్‌కు వచ్చి పనులన్నీ పూర్తి చేస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఒక్క సంతకంతో కొడంగల్‌ను వెతుక్కుంటూ అన్నీ అక్కడికే వస్తాయని ఆయన హామీ ఇచ్చారు. కొడంగల్ ప్రజలు వెళ్లి ఎవరినో, ఏదో అడగాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తనకు పాలించే శక్తిని ప్రసాదించింది కొడంగల్ ప్రజలే అని అన్నారు. కొందరికి అధికారం కోల్పోయినందుకు దుఃఖం ఉండవచ్చని, అలాంటి వారిని పట్టించుకోవద్దని వ్యాఖ్యానించారు. ముస్లిం సామాజిక వర్గానికి ఎక్కువ అవకాశాలు ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీయే అని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి తన కొడంగల్ పర్యటనలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.

ప్రవాసీ మిత్ర సంస్థ "రేవంత్ సర్కారు - గల్ఫ్ భరోసా" పేరుతో రూపొందించిన డాక్యుమెంటరీని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. గల్ఫ్ కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తూ ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన నేపథ్యంలో ఈ డాక్యుమెంటరీని రూపొందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ గారు, ప్రవాసీ మిత్ర ప్రతినిధులు మంద భీమ్ రెడ్డి గారు, పి. సునీల్ కుమార్ రెడ్డి గారు, చెన్నమనేని శ్రీనివాసరావు గారితో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- **16 మంది నక్సల్స్ హతం**

**బలగం టీవి, హైదరాబాద్**

ఛత్తీస్‌గఢ్‌లో సుక్మా జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 16 మంది మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టుల కోసం గాలింపు జరుపుతుండగా సుక్మా పోలీస్ స్టేషన్ పరిధిలోని కెర్లాపాల్ ప్రాంతంలో వారు తారసపడ్డారనీ, ఈ సందర్భంగా ఎదురు కాల్పులు జరిగాయని బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజ్ తెలిపారు. మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డట్లు తెలిసింది. ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. క్షతగాత్రులైన జవాన్లు రాష్ట్ర పోలీస్ విభాగమైన జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి)కి చెందినవారు అని అధికారులు తెలియజేశారు. కేర్లాపల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భద్రతా సిబ్బంది నక్సలైట్ల గాలింపు కార్యక్రమం నిర్వహిస్తున్నప్పుడు అడవిలో ఉదయం సుమారు 8 గంటలకు కాల్పులు పోరు చోటు చేసుకుందని బస్తర్ రేంజ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజి) సుందర్‌రాజ్ చెప్పారు.

'ఎన్‌కౌంటర్ ప్రదేశంలో నుంచి ఇంత వరకు 16 మంది నక్సలైట్ల మృతదేహాలను స్వాధీనం చేసుకోవడమైంది. గాలింపు కొనసాగుతున్నది' అని ఆయన తెలిపారు. కేర్లాపల్ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికి గురించి అందిన సమాచారం ఆధారంగా డిఆర్‌జి, కేంద్ర రిజర్వ్ పోలీస్ దళం (సిఆర్‌పిఎఫ్) సిబ్బంది శుక్రవారం రాత్రి వారి కోసం గాలింపు ప్రారంభించినట్లు ఐజి తెలియజేశారు. ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు డిఆర్‌జి సిబ్బందికి స్వల్ప గాయాలు తగిలాయని, వారి పరిస్థితి మామూలుగానే ఉందని ఆయన చెప్పారు. ఆ ప్రదేశంలో నుంచి ఎకె 47 రైఫిల్, సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్ (ఎస్ఎల్ఆర్), ఇన్సాస్ రైఫిల్, .303 రైఫిల్, రాకెట్ లాంచర్, బారెల్ గ్రనేడ్ లాంచర్ (బిజిఎల్), పేలుడు వస్తువులు సహా భారీ స్థాయిలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు సుందర్‌రాజ్ తెలియజేశారు. ఆ ప్రాంతంలో నకలైట్ల కోసం గాలింపు ఇంకా సాగుతోందని ఆయన తెలిపారు. తాజా ఎన్‌కౌంటర్‌తో ఈ సంవత్సరం ఇంత వరకు రాష్ట్రంలో వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 132 మంది నక్సలైట్లను హతమార్చారు. వారిలో 116 మందిని బీజాపూర్‌తో సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్‌డివిజన్‌లో అంతం చేశారు.

## మార్చి 31న పని చేయనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో మార్చి 31న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. మార్చి 31న సెలవు దినంగా ప్రకటించినప్పటికీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్ఆర్ఎస్ అమలులో భాగంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. గత నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కల్పించింది. ఎల్ఆర్ఎస్ ఫీజులోనూ 25 శాతం రాయితీ ఇవ్వనుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే నేరుగా క్రమబద్ధీకరణ ఫీజును చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించింది. మార్చి 31వ తేదీ లోగా ఫీజు చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపింది. అయితే, మార్చి 30, 31 సెలవు దినాలు కావడంతో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపునకు వీలు కల్పించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పని చేసేందుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## హెచ్‌సీయూలో ఉద్రిక్తత

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. యూనివర్సిటీ క్యాంపస్‌లో 200 మందికి పైగా పోలీసులు మోహరించారు. 400 ఎకరాల యూనివర్సిటీ భూమి అమ్మడానికి ఒప్పుకోము అంటూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేయడానికి హెచ్‌సీయూ విద్యార్థులు ప్రయత్నించారు. విద్యార్థుల నుండి ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను పోలీసులు లాక్కున్నారు. పోలీసులు, విద్యార్థుల మధ్య తొపులాట జరిగింది. అయితే పోలీసుల నుంచి సీఎం దిష్టి బొమ్మను లాక్కొని విద్యార్థులు తగలబెట్టారు.

## గవర్నర్, సీఎం ఉగాది శుభాకాంక్షలు

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం నుంచి శ్రీ విశ్వావసునామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలనీ, ధర్మబద్ధమైన కోరికలు నెరవేరాలని ఇరువురు ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని సీఎం అభిప్రాయపడ్డారు. ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు.

## సైబర్ నేరగాళ్ల వేధింపులకు వృద్ధ దంపతుల ఆత్మహత్య

**బలగం టీవి, హైదరాబాద్**

సైబర్ నేరగాళ్ల వేధింపులకు వృద్ధ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కర్ణాటకలోని బెళగావి జిల్లాలో ఈ విషాద సంఘటన జరిగింది. 82 ఏళ్ల డియోగ్జెరోన్ శాంతన్ నజరెత్, 79 ఏళ్ల ఫ్లావియానా వృద్ధ దంపతులు. ఖానాపూర్‌లోని బీడీ గ్రామంలో వారు నివసిస్తున్నారు. మార్చి 27న ఫ్లావియానా బెడ్‌పై మరణించి ఉండటాన్ని పొరుగువారు గమనించారు. రిటైర్డ్ మహారాష్ట్ర ప్రభుత్వ సెక్రటేరియట్ ఉద్యోగి అయిన డియోగ్జెరోన్ శాంతన్ మృతదేహాన్ని ఆ ఇంటి అండర్ గ్రౌండ్ నీటి ట్యాంక్‌లో గుర్తించారు. ఆయన మెడ, చేతి మణికట్టుపై కత్తి గాయాలున్నాయి. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డియోగ్జెరోన్ శాంతన్ రాసిన సూసైడ్ నోట్‌ను పరిశీలించారు. సుమిత్ బిర్రా, అనిల్ యాదవ్ పేర్లను ఆ నోట్‌లో ఆయన పేర్కొన్నారు. అందులోని వివరాల ప్రకారం.. ఢిల్లీకి చెందిన టెలికాం డిపార్ట్‌మెంట్ అధికారిగా చెప్పుకున్న సుమిత్ బిర్రా అనే వ్యక్తి డియోగ్జెరోన్‌కు ఫోన్ చేశాడు. ఆయన పేరు మీద మోసపూరితంగా సిమ్ కార్డు కొనుగోలు చేసినట్లు తెలిపాడు. వేధింపులు, అక్రమ ప్రకటనలకు ఆ సిమ్ కార్డును వినియోగిస్తున్నట్లు ఆరోపించాడు. ఆ తర్వాత క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన అనిల్ యాదవ్ వ్యక్తికి ఫోన్ కాల్‌ను ట్రాన్స్‌ఫర్ చేశాడు. సిమ్ కార్డ్ దుర్వినియోగంపై చట్టపరమైన పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని డియోగ్జెరోన్ శాంతన్‌ను అతడు బెదిరించాడు. ఆయన ఆస్తి, ఆర్థిక వివరాలను అడిగి తెలుసుకున్నాడు. భయపెట్టి, వేధించి రూ. 50 లక్షలకు పైగా వసూలు చేశారు. మరోవైపు సైబర్ నేరగాళ్లు తమను మరింతగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని డియోగ్జెరోన్ శాంతన్ ఆ సూసైడ్ నోట్‌లో ఆరోపించారు. జూన్ 4న రూ.7.15 లక్షలకు గోల్డ్ లోన్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. 'ఆ అప్పు తీర్చాలి. బంగారాన్ని విక్రయించాలి. ఆ డబ్బును వారికి చెల్లించాలి' అని ఆ నోట్‌లో రాసి ఉంది. అలాగే తన స్నేహితుల నుంచి అప్పుగా డబ్బు తీసుకున్నట్లు డియోగ్జెరోన్ శాంతన్ ఆ నోట్‌లో ప్రస్తావించారు. భార్య బంగారు గాజులు, చెవిపోగులు విక్రయించి వారికి తిరిగి చెల్లించాలని అభ్యర్థించారు. 'మేం వృద్ధులం. మమ్మల్ని ఆదుకునే వారు ఎవరూ లేరు. ఎవరి దయాదాక్షిణ్యాలపై బతకడం ఇష్టం లేదు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆ నోట్‌లో ఉంది. అలాగే మెడికల్ కాలేజీ విద్యార్థుల చదువు కోసం తమ మృతదేహాలను డొనేట్ చేయాలని అందులో కోరారు. కాగా, సైబర్ నేరగాళ్లతో జరిపిన ఆర్థిక లావాదేవీల వివరాలను డియోగ్జెరోన్ మొబైల్ ఫోన్‌లో పోలీసులు గుర్తించారు. ఆ మొబైల్ ఫోన్, సూసైడ్ నోట్, ఆత్మహత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఆయన భార్య ఫ్లావియానా విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు. వృద్ధ దంపతుల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సూసైడ్ నోట్‌లో పేర్కొన్న ఇద్దరు నిందితులపై ఆత్మహత్యకు ప్రేరేపించడం, సైబర్ మోసం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## జీపీవోలుగా మాజీ వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు

- **జీవో విడుదల చేసిన ప్రభుత్వం**

**బలగం టీవి, హైదరాబాద్**

గ్రామ పాలన అధికారులుగా మాజీ వీఆర్‌వోలు(విలేజ్ రెవెన్యూ అధికారి), వీఆర్‌ఏల నియామకంపై తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ మేరకు ఇందుకు సంబంధించి విధివిధానాలు, అర్హతలు ఖరారు చేస్తూ రెవెన్యూశాఖ జీవో ఇచ్చింది. డిగ్రీ అర్హత ఉన్నటువంటి మాజీ వీఆర్‌వోలు, వీఆర్‌ఏలకు జీపీవో(గ్రామపాలన అధికారులు)గా అవకాశం కల్పించనుంది. ఇంటర్‌తో పాటు 5 ఏళ్లు వీఆర్‌వో లేదా వీఆర్‌ఏగా అనుభవం ఉన్నవారు దీనికి అర్హులు. స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక జరుగుతుంది. గ్రామ పాలన అధికారులుగా మాజీ వీఆర్‌ఓలు, వీఆర్‌ఏల నియామకానికి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. జీపీవోలుగా మాజీ వీఆర్‌ఓలు, వీఆర్‌ఏల నియామకంపై విధివిధానాలు, అర్హతలను ఖరారు చేస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 10,954 మంది గ్రామపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. రద్దయిన వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలకు జీపీవోలుగా అవకాశం కల్పించాలని నిర్ణయించింది. అయితే గ్రామ పాలన అధికారులకు రెవెన్యూ వ్యవస్థపై అవగాహన ఉండాలని రిపోర్టులు రాయగలిగి ఉండాలని సీసీఎల్ఏ ప్రభుత్వానికి సూచించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ సూచనలను పరిశీలించిన ప్రభుత్వం అర్హతలను ప్రకటించింది. డిగ్రీ చదివిన మాజీ వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలకు అవకాశం ఇవ్వనున్నట్లు జీవోలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ వెల్లడించారు. లేదా ఇంటర్ చదివి కనీసం ఐదేళ్లు వీఆర్‌ఓ లేదా వీఆర్‌ఏగా అనుభవం ఉన్న వారు కూడా అర్హులేనని తెలిపారు.

## ఎన్టీఆర్ ట్రస్ట్ 'న్యూట్రిఫుల్ యాప్'కు స్కోచ్ అవార్డు

**బలగం టీవి, హైదరాబాద్**

ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ కు చెందిన న్యూట్రిఫుల్ యాప్, ఈ సంవత్సరం జరిగిన స్కోచ్ అవార్డులలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగంలో మొదటి బహుమతిని గెలుచుకుంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిని ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అభినందించారు. నారా భువనేశ్వరి మరియు న్యూట్రిఫుల్ బృందానికి అభినందనలు అంటూ చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందించారు. అందరికీ ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో వారు చేస్తున్న కృషి అభినందనీయమని, వారికి మరిన్ని విజయాలు కలగాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని ఈ యాప్‌కు 4 లక్షలకు పైగా ఎన్‌రోల్‌మెంట్‌లు ఉన్నాయని. ఆరోగ్య సంరక్షణ ముఖ్య ఉద్దేశంగా ఇది పనిచేస్తూ, 4 లక్షలకు పైగా ఉచిత సంప్రదింపులు మరియు ఆహార ప్రణాళికలను అందిస్తోందని చంద్రబాబు వివరించారు.

అత్యాధునిక ఫుడ్ స్కానర్‌తో సహా తాజా ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేస్తున్న ఈ యాప్‌కు శిక్షణ పొందిన న్యూట్రిషనిస్టుల బృందం మద్దతు ఇస్తోందని వెల్లడించారు. న్యూట్రిఫుల్ యాప్ ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడంలో విశేషమైన ముందడుగు వేస్తోందని వివరించారు.

# పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు సలహాలు అందించాలి..

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- లా అండ్ ఎన్ఫోర్స్ మెంట్ పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఈఓ
- పాల్గొన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు సలహాలు, సూచనలు అందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఓటర్ జాబితా సవరణ పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో కంటే నిర్వహించిన ఎన్నికల కంటే మెరుగ్గా రాబోయే రోజుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు, అన్ని వర్గాలకు చెందిన ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు వినూత్న కార్యక్రమాలు అమలుకు, పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సలహాలు సూచనలు అందించాలని ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మార్గదర్శకాల పట్ల ప్రతి ఒక్క సిబ్బంది అవగాహన కల్గి ఉండాలని, ప్రతి ఒక్కరికి తమ పాత్ర పట్ల , విధులు గురించి పూర్తిగా తెలిసి ఉండాలని అన్నారు. సజావుగా శాంతి భద్రతల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు చేపట్టాల్సిన చర్యల గురించి సలహాలు అందించాలని అన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారీ రాధాబాయి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దేవునిగుట్టతండాలో సివిల్ రైట్స్ డే

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలంలోని దేవునిగుట్టతండా గ్రామంలో సివిల్ రైట్స్ డే (మానవ హక్కుల పరిరక్షణ సమావేశం) బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా విజలెన్స్ ఎస్సీ ఎస్టీ కమిటీ మెంబర్ అజ్మేరా తిరుపతినాయక్ పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ఎలాంటి కుల వివక్ష ఉండకూడదని అన్ని వర్గాల కలిసిమెలిసి ఉండాలని సూచించారు. గ్రామంలో రెండు గ్లాసుల పద్ధతి పాటించవద్దని, అలా చేస్తే అధికారులు చట్ట పరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు జరిగే ఇబ్బందులపై, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామాలలో ఎస్సీ ఎస్టీ పిల్లలు చదువుకొని మంచి గుర్తింపు తెచ్చుకోవాలని, ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలని కోరారు. చదువుకునే పిల్లలు చెడు మార్గాన్ని ఎన్నుకో వద్దని గంజాయి ,డ్రగ్స్ అలవాటు పడద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంతోష్, పోలీస్ కాన్స్టేబుల్ ప్రసాద్, స్పెసల్ ఆఫీసర్ బాస్కర్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, అంగన్వాడీ జ్యోతి,అసవర్కర్లు గ్రామనాయకులు,రాజ్య నాయక్, ప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సాహితీ సమితి ఉగాది కవి సమ్మేళన సన్మానాలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గాంధీనగర్ హనుమాన్ మందిరంలో డాక్టర్ జనపాల శంకరయ్య అధ్యక్షతన ఉగాది.. విశ్వావసు సంవత్సర కవి సమ్మేళనం లో విశ్వాస నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు క్రోధినామ సంవత్సరానికి వీడ్కోలు చెప్పారు. కవితా దానం ఘనంగా జరిగింది. సభాధ్యక్షులు డాక్టర్ జనపాల శంకరయ్య ఉగాది సందర్భంగా స్వాగతోపన్యాసంలో ధర్మబద్ధమైన, శాస్త్రబద్ధమైన, పనులను పక్కన పెట్టేసి ఆంగ్లేయులు మనల్ని వదిలిపెట్టిన మనము వారి సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నందుకు చింతిస్తున్నానన్నారు."సనాతన సంప్రదాయములో సైన్స్ ఉంది. ఆంగ్ల సంవత్సరాదికి ముంగిళ్ళలో ముగ్గులు మురుస్తాయి .

ఉగాదికి ఉలుకు పలుకు ఉండదు ఎందుకు? అమ్మను మమ్మీ నాన్నను డాడీ చేసి డమ్మిలను చేస్తున్న సంప్రదాయమేమిటి" అదే ఉగాది సందర్భంగా 90% ముంగిళ్ళు బోసిపోతున్నాయి. పరాయి సంస్కృతిని నెత్తిన పెట్టుకుంటూ మన సంస్కృతిని కాలగర్భంలో ముంచేత్తుతున్నామని వాపోయారు. అధ్యక్షులు పోరండ్ల మురళీధర్ ఉగాది పండగ కండువాల దాతగా నిలిచారన్నారు. వైద్యం ఆరోగ్యం పుస్తకానికి చింతోజు శంకర్ డాక్టరు రాజారాం డాక్టర్ కూడా ఒకప్పుడు సహకరించారన్నారు వారే డబ్బులు ఖర్చు పెట్టి భోజనాలు పెట్టి అక్కడే ఆవిష్కరించారు అన్నారు. వ్యాఖ్యాతగా మా ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్ సందర్భోచితంగా వ్యాఖ్యాతగా నిలిచారన్నారు. ముఖ్య అతిథులుగా మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు చింతోజు భాస్కర్ పండుగ ప్రాశస్త్యాన్ని సిసాస వైభవాన్ని గురించి వివరించారు. ముఖ్య సలహాదారులు కరుణాల భద్రాచలం. రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి చేస్తున్న కార్యక్రమాలు సమాజ హితం కోసం పడుతున్న తపన కనిపిస్తుందన్నారు. సహాధ్యక్షులు కోడం నారాయణ 1997లో దూడం నాంపల్లి, పోస్ట్మాన్, దేవత వెంకట్ రాములు, ఆడెపు నారాయణ, గడ్డం చంద్రయ్య మొదలైన వారు కలిసి ఏర్పాటు చేశామన్నారు. అప్పటికి ఇప్పటికీ సజావుగా నడుస్తున్నందుకు సంతోషం అన్నారు.

సహాధ్యక్షులు నేరోజు రమేష్ ఉగాది పండుగ చక్కని కవిత ఆలాపించారు. సీనియర్ సిటిజన్ జిల్లా అధ్యక్షులు చేపూరి బుచ్చయ్య పాల్గొన్నారు. సీనియర్ సిటిజనులకు సేవలందిస్తున్న గాదమైసయ్య దొ%శీ%త దేవదాసు అంకారపు జ్ఞానబ మొదలైన వారిని సన్మానించారు. ఆధ్యాత్మికంగా సేవలందిస్తున్న మోతిలాల్ నాయక్ వేముల బక్కయ్య అహంకారపు కృష్ణ హరి పోశెట్టి మొదలైన వారిని సన్మానించారు. కవులు గూడూరి బాలరాజు, సింగిరెడ్డి రాజిరెడ్డి, గోషికొండ మురారి పంతులు, గోష్కొండ దామోదరం పంతులు, గడ్డం పరశురామశాస్త్రి, జల్లా శ్రీనివాస్ పంతులు, బూర దేవానందం, మాదిరెడ్డి అంజనాదేవి, గడ్డం కౌసల్య, కనపర్తి హనుమాన్లు, ముడారి సాయి మహేష్, గుండెల్ని వంశీకృష్ణ, గజ్జెల్లి కుమారస్వామి, వడ్డేపల్లి రామస్వామి, సంగీతం సత్యనారాయణ,సభికుల్ని కవితలతో అలరించారు కవులందరూ పాల్గొన్నారు.

# అగ్నివీర్ కు లక్ష్మీపూర్ యువకుడి ఎంపిక..

**బలగం టీవీ,తంగళ్ళ పల్లి**

అగ్నివీర్ కు తంగళ్ళ పల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన యువకుడు వట్టిమల్ల సాయితేజ ఎంపికయ్యారు. సాధారణ కుటుంబానికి చెందిన వట్టిమల్ల సాయితేజ స్థానికంగానే విద్యను పూర్తి చేశారు. తల్లిదండ్రులు లక్ష్మణ్ , రాణి లు వ్యవసాయ పనులు చేస్తూ కుమారుడిని చదివిపించారు. తల్లిదండ్రుల కష్టాన్ని చూస్తూ పెరిగిన సాయితేజ భారతదేశ సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలన్న సంకల్పంతో గత రెండేళ్ళుగా కరీంనగర్ లో ఉంటూ శిక్షణ పొందుతున్నాడు. ఇటీవలే ప్రకటించిన అగ్నివీర్ జనరల్ డ్యూటీ కేటగిరి ఫలితాల్లో ప్రతిభకనబరిచి తన స్వప్నాన్ని సాకారం చేసుకున్నాడు.అగ్నివీర్ కు ఎంపికైన యువకుడు సాయితేజ ను గ్రామ యువకులు , పెద్దలు అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ వితరణ

**బలగం టీవీ ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల తిమ్మాపూర్ ఉన్నత పాఠశాలకు, యునిమొని సంస్థ ఎల్లారెడ్డిపేట శాఖ ఆధ్వర్యంలో వాటర్ ప్యూరిఫైయర్ ను శనివారం వితరణ చేశారు. యునిమొని జోనల్ మేనేజర్ టి. శ్రీనివాస్ రెడ్డి, రీజినల్ మేనేజర్ డి. రాజేంద్రప్రసాద్, ఎల్లారెడ్డిపేట శాఖ మేనేజర్ వి. శంకర్ హాజరై మాట్లాడారు. కంపెనీ అందిస్తున్న సేవలను వివరించారు. సిఎస్ఆర్ నిధుల నుంచి ఈ విరాళం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. కృష్ణహరి, ఉపాధ్యాయులు గోపాలరెడ్డి, శ్రీనివాస్, భాస్కర్ రావు, భాస్కర్, ఆశ్లేష, ఆనంద్, నాగరాణి, నారాయణ, పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

# భారతి విద్యానిలయంలో ఉగాది సంబరాలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలోని భారతి విద్యానిలయం ఇ/మీ పాఠశాల, వాసవినగర్, సిరిసిల్ల యందు Threads of Tradition Fest ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వెలుముల రాంరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ బద్ది క్రిష్ణాకర్ రెడ్డి, ఈ. బాలకృష్ణ, మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఉగాది గురించి, పండగ ప్రాముఖ్యత గురించి విధ్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ( Nursery to IX Class ) సంప్రదాయ వస్త్రధారణలో ర్యాంప్ వాక్ చేశారు.

# సిరిసిల్ల బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శికి చిరు సత్కరం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా లోని సిరిసిల్ల బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఇటీవలే ఎన్నికైన సందర్భంగా సీనియర్ న్యాయవాది తంగళ్ళపల్లి వెంకట్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల పోరం మాజీ అధ్యక్షులు మాట్ల మధు, సిలివేరి చిరంజీవి, ఇమ్మనేని అమర్ రావు, గుండు ప్రేమ్ కుమార్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దూరు పాఠశాలలో ఘనంగా ఉగాది వేడుకలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఎంపీహెచ్ఎస్ పెద్దూరు పాఠశాలలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని విద్యార్థులందరికీ అందించారు. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు లాగానే మన జీవితంలో కూడా కష్టనష్టాలు, సుఖశాంతులు, అన్ని రకాల భావోద్వేగాలు ఉంటాయని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. కొత్త సంవత్సరం ఉగాది తోనే ప్రారంభమవుతుందని, వసంత ఋతువుల విద్యార్థులందరి జీవితాలు చిగురించాలని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి గారు విద్యార్థులను ఆశీర్వదించారు. ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమా, బైరి వాణిశ్రీ, కడార్ల కల్పన, నాగుల వీణ, నందాల శంకర్, రాజమల్లు ,రవికుమార్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# ముంబై ఇండియన్స్‌కు మరో ఓటమి

- 36 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్ విజయం
- హాఫ్ సెంచరీతో రాణించిన సాయి సుదర్శన్

**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ వరుసగా రెండో ఓటమిని ఎదుర్కొంది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 36 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. మరోవైపు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో గుజరాత్ టైటాన్స్ ఈ సీజన్‌లో బోణీ కొట్టింది. బ్యాటింగ్‌లో సాయి సుదర్శన్ చెలరేగితే.. బౌలింగ్‌లో మహమ్మద్ సిరాజ్(2/34), ప్రసిధ్ కృష్ణ(2/18) సత్తా చాటారు.

ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్..నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 196 పరుగులు చేసింది. సాయి సుదర్శన్(41 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీతో రాణించగా.. శుభ్‌మన్ గిల్(27 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 38), జోస్ బట్లర్(24 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 39) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ముంబై బౌలర్లలో హార్దిక్ పాండ్యా(2/29) రెండు వికెట్లు తీయగా.. ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, ముజీబ్ ఉర్ రెహ్మా న్, సత్యనారాయణ రాజు తలో వికెట్ తీసారు.

అనంతరం ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 160 పరుగులే చేసి ఓటమిపాలైంది. సూర్యకుమార్ యాదవ్(28 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 48), తిలక్ వర్మ(36 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 39)మినహా అంతా విఫలమయ్యారు. గుజరాత్ బౌలర్లలో సిరాజ్, ప్రసిధ్ కృష్ణ రెండేసి వికెట్లు తీయగా.. కగిసో రబడా, సాయి కిషోర్ తలో వికెట్ తీసారు.

## ఐపీఎల్ షెడ్యూల్‌లో మార్పు

**బలగం టీవి, హైదరాబాద్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ఏప్రిల్ 6వ తేదీన ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్, లక్నో సూపర్‌జయింట్స్ మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే అదే రోజు శ్రీరామనవమి పండగ కూడా ఉంది. కోల్‌కతాలో ఈ పండుగ ఘనంగా జరుగుతుంది. దీంతో పోలీసులు భద్రత ఏర్పాట్లు చేయడం కష్టమవుతుందని బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ బీసీసీఐని కోరింది. దీంతో బీసీసీఐ కెకెఆర్ వర్సెస్ ఎల్‌ఎస్‌జి మ్యాచ్‌ను 8వ తేదీకి వాయిదా వేసింది. ఇక శ్రీరామనవమి పండుగ రోజు హైదరాబాద్‌లో జరిగే సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ మ్యాచ్ యథాతథంగా జరగనుంది

## ముందే ధోనీ బ్యాటింగ్‌కు వచ్చి ఉండాల్సింది

- షేన్ వాట్సన్

**బలగం టీవి, హైదరాబాద్**

రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ముందే ధోనీ బ్యాటింగ్‌కు వచ్చి ఉండాల్సిందని ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ షేన్‌వాట్సన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ధోనీ లోయర్ ఆర్డర్‌లో ఎందుకు బ్యాటింగ్ వస్తున్నాడో తనకు అర్థం కావడం లేదని పేర్కొన్నారు. శుక్రవారం చెపాక్ స్టేడియంలో బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే 50 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైంది. ఈ సందర్భంగా షేన్ వాట్సన్ మాట్లాడుతూ కెప్టెన్ రితురాజ్ గైక్వాడ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డాడు. రవిచంద్రన్ అశ్విన్‌ను ధోనీ కంటే ముందు పంపారని చెప్పాడు. ఈ మ్యాచ్‌లో తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి న ధోనీ కేవలం 16 బంతుల్లో 30 పరుగులు చేశాడన్నారు. చివరి వరకు సీఎస్‌కే ఓటమి నుంచి గట్టెక్కించేందుకు ప్రయత్నించగా.. అప్పటికే చాలా ఆలస్యమైందని.. ధోనీ క్రీజులోకి వచ్చే ముందే దాదాపుగా మ్యాచ్ చివరకు చేరిందన్నారు. సీఎస్‌కే అభిమానులు చూసిందే కేవలం ధోనీ బ్యాటింగ్ మాత్రమేనని తెలిపాడు. ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు రావాలని.. అలా చూసేందుకు తాను ఇష్టపడతానని చెప్పారు. అశ్విన్ కన్నా ముందే ధోనీ బ్యాటింగ్‌కు వచ్చి ఉండాల్సిందని.. ఆట పరిస్థితిని బట్టి కనీసం 15 బంతులు అదనంగా ఆడేవాడని పేర్కొన్నాడు. గత కొన్నేళ్లుగా తాను ఇంకా అద్భుతంగా బ్యాటింగ్ చేయగలనని నిలకడ చూపించాడని.. అతన్ని టాప్ ఆర్డర్‌లో చూడాలనుకుంటున్నట్లు చెప్పాడు. గత ఎడిషన్‌లో ధోని లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేశాడని.. ఆర్‌సీబీతో మ్యాచ్‌లో టాప్ ఆర్డర్, మిడిలార్డర్ కుప్పకూలిందని.. రాహుల్ త్రిపాఠిని ఓపెనర్‌గా పంపడం తదితర నిర్ణయాలపై నిరాశ వ్యక్తం చేశాడు. గైక్వాడ్ గొప్ప ఓపెనర్ అయినప్పటికీ తర్వాత బ్యాటింగ్‌కు రావాల్సిందని అభిప్రాయపడ్డాడు. రుతురాజ్ గైక్వాడ్ మైదానంలో స్ట్రయిక్ రొటేట్ చేస్తాడని.. అతని షాట్లు చూస్తే ఒత్తిడిలో ఉన్నట్లుగా కనిపించిందని.. దీపక్ హుడా సైతం ప్రస్తుతానికి ఆడేందుకు సిద్ధంగా లేడని.. ప్రతి బంతిని తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లుగా ఆడాడని పేర్కొన్నాడు. సామ్ కర్రన్‌ను ఐదో స్థానంలో బ్యాటింగ్ చేయించడం తప్పుడు నిర్ణయమని.. తాను మాత్రం నెంబర్ సెవెన్ బ్యాటర్‌గా చూస్తున్నానని.. ప్రస్తుతం జట్టు కాంబినేషన్ సరిగా లేదని.. తప్పనిసరిగా కొన్ని మార్పులు చేయాల్సిందేనని అభిప్రాయపడ్డాడు. ఇదే బ్యాటింగ్ ఆర్డర్‌ను కొనసాగితే ఇబ్బందిగా మారుతుందని తెలిపాడు. ఇక ధోనీ వికెట్ కీపింగ్‌పై ప్రశంసలు కురిపించాడు. గతంలో తరహాలోనే ఇప్పటికీ వికెట్ల వెనుక చురుగ్గా ఉన్నాడని చెప్పాడు.

## కన్నప్ప విడుదల వాయిదా..

**బలగం టీవి, హైదరాబాద్**

మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నాడు. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. అయితే ఈ సినిమాను మొదటగా ఏప్రిల్ 25న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. తాజాగా మూవీని వాయిదా వేసినట్లు మంచు విష్ణు వెల్లడించారు. వీఎఫ్ఎక్స్ ఆలస్యం అవుతుండడంతో ఈ మూవీని వాయిదా వేసినట్లు విష్ణు ఎక్స్ వేదికగా ప్రెస్ నోట్ విడుదల చేశాడు.

"ప్రియమైన అభిమానులకు, సినీ ప్రేమికులకు విజ్ఞప్తి.. కన్నప్ప పోస్ట్ ప్రొడక్షన్ పనులు అద్భుతంగా సాగుతున్నాయి. ఈ సినిమాను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నాం. ఈ ప్రాజెక్ట్ గొప్పగా రావడానికి మాకు మరింత సమయం పట్టేలా ఉంది. ఎందుకంటే ఒక ముఖ్యమైన ఎపిసోడ్‌కు మంచి వీఎఫ్ఎక్స్ అవసరం. దాని వలన సమయం పడుతుంది. మూవీ విడుదల ఆలస్యం అవుతున్నందుకు అభిమానులకు, సినీ ప్రియులకు క్షమాపణలు చెబుతున్నాం. త్వరలోనే కొత్త తేదీతో మీ ముందుకు వస్తామంటూ విష్ణు రాసుకోచ్చాడు.




## 'కేసరి 2' ఫస్ట్ లుక్ రిలీజ్

**బలగం టీవి, హైదరాబాద్**

బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'కేసరి చాప్టర్ 2' . మాధవన్, రెజీనా కసాండ్రా, అనన్య పాండే కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు కరణ్ సింగ్ త్యాగీ దర్శకత్వం వహిస్తుండగా.. ధర్మ ప్రొడక్షన్ బ్యానర్‌పై కరణ్ జోహార్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. సమ్మర్ కానుకగా ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. జలియన్ వాలా బాగ్ ఘటనపై ఈ సినిమా రాబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

## కాంట్రవర్సీలకు దూరంగా ఉంటున్నాను: సల్మాన్ ఖాన్

**బలగం టీవి, హైదరాబాద్**

సల్మాన్ ఖాన్ నటించిన తాజా చిత్రం సికందర్. ఏఆర్ మురుగదాస్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. రంజాన్ కానుకగా మార్చి 30న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో భాగంగా మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు. ఒక ఇంటర్వ్యూలో భాగంగా.. ఈ సినిమా కాంట్రవర్సీ అవుతుందన్న ప్రశ్నకు సల్మాన్ సమాధానమిస్తూ.. తాను కాంట్రవర్సీలకు దూరంగా ఉంటున్నట్లు తెలిపాడు. జీవితంలో చాలా కాంట్రవర్సీలను ఎదుర్కొన్నాను. ఇకపై ఎటువంటి వివాదం అవసరం లేదు. నా జీవితంలో ఇప్పటికే చాలా వివాదాలను చూశాను. ఇకనుంచైన వివాదాలు లేకుండా ఉండాలని కోరుకుంటున్నా" అన్నారు.

## వివాదంలో 'ఎల్ 2 ఎంపురాన్'

**బలగం టీవి, హైదరాబాద్**

స్టార్ నటుడు మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రం వివాదంలో చిక్కుకున్నది. ఆర్ఎస్ఎస్ ఈ మూవీని హిందూ వ్యతిరేక చిత్రంగా అభివర్ణించింది. కాంగ్రెస్ ఈ చిత్రానికి మద్దతు ప్రకటించగా.. బీజేపీ మాత్రం సైలెంట్‌గా ఉంది. అయితే ఎల్ 2 ఎంపురాన్‌పై ఆర్ఎస్ఎస్ తీవ్రంగా విమర్శలు గుప్పించింది. ఆర్ఎస్ఎస్ మౌత్ పీస్ ఆర్గనైజర్‌లో ప్రచురించిన కథనం ప్రకారం.. ఈ చిత్రం 2002 గోద్రా అల్లర్ల నేపథ్యాన్ని ఉపయోగించి హిందూ వ్యతిరేక రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకువస్తుందని ఆరోపించింది. ఈ మూవీ స్టోరీ హిందువులను కించపరచడమే కాకుండా.. ప్రత్యేకంగా హిందూ అనుకూల రాజకీయ భావజాలాలను లక్ష్యంగా చేసుకుంటుందని విమర్శించింది. ఈ సినిమా హిందూ వ్యతిరేక, బీజేపీ వ్యతిరేక కథనాన్ని వ్యాప్తి చేయడానికి ఒక మాధ్యమమని.. వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరించారంటూ మండిపడింది.భారతదేశంతో సహా ఉపఖండంలో జరుగుతున్న మారణహోమం మధ్య హిందువులను విలన్లుగా చిత్రీకరించే హిందూ వ్యతిరేక ప్రచార చిత్రం ఎంపురాన్ అంటూ మండిపడింది. బీజేపీ కేరళ ప్రధాన కార్యదర్శి పీ సుధీర్ మాట్లాడుతూ ఈ మూవీ తన దారిలో వెళ్తుందని.. పార్టీ సైతం తన పని తాను చేసుకుంటుందన్నారు. ఈ సినిమాతోనూ పార్టీ ప్రభావితం కాదన్నారు.

## కాబోయే భర్తను పరిచయం చేసిన నటి అభినయ

**బలగం టీవి, హైదరాబాద్**

పుట్టుకతో చెవిటి, మూగ అయినప్పటికీ అభినయ సినిమాల్లో అద్భుతంగా రాణిస్తున్న సంగతి తెలిసిందే. అయితే త్వరలో ఆమె పెళ్లి పీటలెక్కనున్నారు. హైదరబాద్‌కు చెందిన సన్నీ వర్మ అనే వ్యక్తితో ఈ నెల 9న నిశ్చితార్థం జరిగినట్టు ఆమె సోషల్ మీడియా ద్వారా తెలిపారు. కాబోయే భర్తను పరిచయం చేస్తూ, అతనితో కలిసి దిగిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె షేర్ చేశారు. త్వరలోనే తాను పెళ్లి చేసుకోబోతున్నట్లు వెల్లడించారు. సినీ అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 'ధ్రువ', 'శంభో శివ శంభో','సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు', 'రాజుగారి గది2' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.